క్లుప్తంగా

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

నందిగామ టౌన్: నందిగామ నియోజకవర్గంలో ఈ-క్రాప్, పంటనష్టం నమోదు చేయించుకున్న రైతులంతా విధిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆర్డీవో రవీంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాస్ సోమవారం సూచించారు. ఈ-కేవైసీ చేయించుకోని రైతులు ఇన్‌పుట్స్ సబ్సిడీ పొందలేరని తెలిపారు. ఈనెల 24వతేదీ మంగళవారంలోగా సచివాలయాలు, రైతుసేవా కేంద్రాల్లో తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్యపరీక్షలు



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఉక్కు కళావేదికలో మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి సూపరిండెంట్ ఆళ్ల హరీష్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీప్రసన్న, వైద్యులు సంపత్, లోకేష్, డాక్టర్ ధర్మకర్ పాల్గొని కార్మికులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యపరంగా పారిశుద్ధ్య కార్మికులు పాటించాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు.

స్వామివారికి బంగారు నామాలు బహూకరణ



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారికి ఓ భక్తుడు బంగారు నామాలను బహూకరించారు. నందిగామ పట్టణంలోని అనాసాగరం ప్రాంతానికి చెందిన తాటి అక్కయ్య 14గ్రాములతో తయారు చేయించిన బంగారు నామాలను ఆలయ ఏసీ వరప్రసాద్‌కు సోమవారం అందజేశారు. ఈసందర్భంగా దాతను స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, సిబ్బంది రామకృష్ణ, వెంకటేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

లడ్డూ తయారీ కేంద్రం పరిశీలన..

తిరుమలగిరి(జగ్గయ్యపేట): వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయంలోని లడ్డూ ప్రసాద తయారీకేంద్రాన్ని ఏసీ వరప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి పలు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారని వారికి నాణ్యమైన లడ్డూ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే లడ్డూ తయారు చేస్తున్నామని తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



జగ్గయ్యపేట: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జగ్గయ్యపేట విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచారు. ఈనెల 22న హైద్రాబాద్‌లోని గ్రీన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఓపెన్ నేషనల్ ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని తపోవన్, లిటిల్‌ఏంజెల్స్, రామ్‌కో సేతు రామ్మల్ విద్యామందిర్‌కు చెందిన 24మంది సబ్ జూనియర్, జూనియర్ విద్యార్థులు కాటా, కుముటి విభాగాల్లో పాల్గొని గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. ఈ సందర్భంగా కోచ్ ఎమ్ఎమ్ నాయక్‌ను ఆయా పాఠశాలల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఏలేశ్వరరావు, శ్రీనివాస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పునరుద్ధరణ పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్

జగ్గయ్యపేట: మండలంలోని బలుసుపాడు-అన్నవరం వెళ్లే రహదారిలోని పాలేటిపై ఉన్న బ్రిడ్జి పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈనెల 18న 'బ్రిడ్జి పునరుద్ధరణ ఎప్పుడో' శీర్షికన సాక్షి ప్రచురించిన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. ఇటీవల పాలేటికి వచ్చిన వరద ఉధృతికి బలుసుపాడు-అన్నవరం రోడ్డులో పాలేటిపై ఉన్న బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుతోపాటు ఇరుపక్కల దాదాపు కిలోమీటరు మేర రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో 23రోజులుగా ఈ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిన వైనంపై 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన వార్తకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి బ్రిడ్జి పునరుద్ధరణ పనులు చేపట్టారు. మరో ఐదురోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తవుతాయని ఆర్అండ్‌బీ డీఈ టి.పరుశురాముడు తెలిపారు.

ఉత్సాహంగా మండలస్థాయి క్రీడా పోటీలు



వత్సవాయిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ యేశపోగు దేవమణి

వత్సవాయి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వత్సవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న క్రీడాపోటీలను జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణి ప్రారంభించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు దేవమణి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో విశేష ప్రతిభను కనబరిచేవారికి విద్యా, ఉపాధి అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్ సదుపాయాలు ఉంటాయన్నారు. విద్యార్థులంతా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ఈపోటీల్లో భాగంగా బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కంచికచర్ల ఎంఈవో బాలాజీ, ఎంపీటీసీ సభ్యుడు కె.బాబు

పోటీలకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండలస్థాయిలో ప్రతిభచూపిన క్రీడాకారులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కె.సామ్రాజ్యం, ఎంఈవో ఎల్.నాగరాజు, క్రీడా పోటీల నియోజకవర్గ కన్వీనర్ గంటా వెంకటేశ్వర్లు, జెడ్పీ హెచ్ఎం ఆర్.అశోక్‌కుమార్, కాకాని శ్రీనివాసరావు, అద్దంకి సుధాకర్, పీడీ మార్కపూడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : క్రీడలు దేహదారుఢ్యానికి దోహదపడతాయని కంచికచర్ల ఎంఈవో బి.బాలాజీ, ఎంపీటీసీ సభ్యుడు కోగంటి బాబు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలస్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, స్కూల్ గేమ్స్ నిర్వాహకులు గంద్రాల రాజేంద్ర ప్రసాద్, క్రీడాకారులు, పీఈటీలు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామ టౌన్: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని నందిగామ ఎంఈవో పద్మావతి సూచించారు. స్కూల్ గేమ్స్‌లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో పద్మావతి మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. ఆహ్లాదం, ఆరోగ్యం కోసమే కాకుండా క్రీడలతో భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలలో ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు.తొలుత ఆమె క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు విజయలక్ష్మి, మండల కోఆర్డినేటర్ కళ్యాణ్‌రాజు, ఆయా పాఠశాలల క్రీడాకారులు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.



నందిగామలో కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

నేటినుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం

జగ్గయ్యపేట: ఈనెల 24 నుంచి డిసెంబర్ 26 వరకు నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏడీఏ సి.భవాని సోమవారం తెలిపారు. ప్రతి మంగళ, బుధ వారాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తారన్నారు. మంగళవారం వత్సవాయిలో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ప్రారంభిస్తారన్నారు. రైతులు పాల్గొనాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నందిగామ టౌన్: ఆపదలో ఉన్నవారిని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. సీఎంఆర్ఎఫ్ కింద ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5.92లక్షల విలువగల చెక్కులను సోమవారం ఆమె తనకార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యం బారినపడి ఇబ్బందులుపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా తమ ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అధ్యాపకులు వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

కంచికచర్ల : మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవచ్చని, వృత్తి నైపుణ్యాలను నాయకత్వ లక్షణాలను మెరుగుపర్చుకోవచ్చని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ ఏఐసీటీఈ-ఏటీఏఎల్ సహకారంతో ఆరురోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అధ్యాపకులు మారుతున్న టెక్నాలజీపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బీ.సునీత మాట్లాడుతూ క్లౌడ్ ఉపయోగించే డేటా అనలిటిక్స్ అప్లికేషన్స్‌ను రూపొందించే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.విజయకుమార్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ డాక్టర్ విజయకుమార్

పూర్తికాని పైపులైన్ మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



భీమవరంలో బోరు వద్ద నీటికోసం వేచి ఉన్న జనం

ప్రజలకు తప్పని మంచినీటి కష్టాలు

వత్సవాయి: ఇటీవల సంభవించిన వరదలకు దెబ్బతిన్న చిల్లకల్లు రక్షిత మంచినీటి పథకానికి 20రోజులుగా మరమ్మతులు పూర్తిగాకపోవడంతో ఆయా గ్రామాల తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. భారీ వర్షాలతోపాటు మునేటికి వరద పోటెత్తడంతో రక్షిత మంచినీటి పథకాలకు చెందిన బోర్లు, మోటార్లు వరదకు కొట్టుకుపోయాయి. కాజ్‌వేపై ఏర్పాటు చేసిన పైపులైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. కొత్త మోటార్లు ఏర్పాటుచేయడంతోపాటు పైపులైన్ పనులను చేస్తున్నారు.అయితే ఈ మరమ్మతు పనులు పూర్తిగాకపోవడంతో మంచి నీటి పథకం పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు అవస్థలుపడుతున్నారు. సుదూర ప్రాంతాల్లోని బోర్ల వద్ద నుంచి క్యాన్ల ద్వారా నీరు తెచ్చుకునేందుకు ఇబ్బందిపడుతున్నారు. ఈ మరమ్మతుపనులు మరో 10రోజులపాటు కొనసాగే అవకాశం ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతుండటంతో అప్పటివరకు ప్రజలకు మంచినీటి కష్టాలు తప్పేలా లేవు.

ఎన్నికల బకాయిలు చెల్లించాలని వినతి

నందిగామ టౌన్:ఎన్నికల సమయంలో పనిచేసిన ఫోటో, వీడియో గ్రాఫర్లకు అధికారులు బిల్లులు చెల్లించకపోవటంతో అవస్థలు పడుతున్నామని నవ నందిగామ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు వారు నందిగామ ఆర్డీవో రవీంద్రరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో 56రోజులు ఎన్నికల సమయంలో పనిచేశామన్నారు. ఆసమయంలో అడ్వాన్సుల రూపంలో రూ.5.03 లక్షలు ఇచ్చారని, మిగిలిన రూ. 14.88 లక్షలను అధికారులు ఇప్పటివరకు చెల్లించకపోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా స్పందించి తమ బకాయిలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తుటారి కృష్ణ, లక్ష్మణ్, సుభానీ, ఆంజనేయులు, రసూల్, మల్లికార్జునరావు, కొండ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల బకాయిలు చెల్లించాలని కోరుతున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

ఐదుగురికి తీవ్రగాయాలు

చందర్లపాడు(నందిగామ టౌన్): ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు..నందిగామ మండలం అడవిరావులపాడు నుంచి చందర్లపాడు మండలంలోని కోనాయపాలెంలో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు కూలీలు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో కోనాయపాలెం గ్రామ సమీపంలో వీరి ఆటోను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో అడవిరావులపాడు గ్రామానికి చెందిన చిన్న లక్ష్మయ్య, పుల్లయ్య, అచ్చారావు, ప్రభుదాసులు గాయపడ్డారు. వీరిని చికిత్సనిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వైవీఎల్ నాయుడు తెలిపారు.

మహిళకు తీవ్రగాయాలు..

జుజ్జూరు(వీరులపాడు): బైక్‌పై వెళ్తున్న మహిళను ఆటో ఢీకొట్టడతో ఆమె తీవ్రగాయాలపాలైన ఘటన జుజ్జూరులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు జుజ్జూరు గ్రామానికి చెందిన పానకాల కోటేశ్వరి సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం వెళ్తుండగా జుజ్జూరులోని పెట్రోల్ బంక్ వద్దకు వచ్చే సరికి పెద్దాపురం నుంచి జుజ్జూరు వైపు వస్తున్న ఆటో వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మహిళ రెండు కాళ్లకు తీవ్రగాయాలు కాగా ప్రమదానికి కారణమైన ఆటో కందకంలో పడిపోయింది. ఈమేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మహిళ తీవ్రంగా గాయపడిన విషయాన్ని స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గంటపాటు వేచి ఉన్నా అంబులెన్స్ రాకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం ఆమెను ప్రైవేట్ వాహనంలో విజయవాడకు తరలించారు.



రోడ్డుప్రమాదంలో గాయపడిన పి.కోటేశ్వరికి సపర్యలు చేస్తున్న స్థానికులు


శ్రీతిరుపతమ్మ ఆలయ ఈవోగా కిషోర్‌కుమార్

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ ఈవోతోపాటు పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఇక్కడ ఎఫ్ఏసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈవో జీవీడీఎన్ లీలాకుమార్ పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ ఈవోగా బదిలీకాగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా పనిచేస్తున్న బీహెచ్ వీఎస్ఎన్ కిషోర్‌కుమార్ బదిలీపై ఇక్కడికి రానున్నారు. ఆలయ ఈఈ టి.వైకుంఠరావు విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి బదిలీకాగా, అక్కడ పనిచేస్తున్న ఎల్.రమ పెనుగంచిప్రోలుకు బదిలీ అయ్యారు. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.రమ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న సీనియర్‌అసిస్టెంట్లు బి.నాగరాజు, ఎల్ఎల్‌వీబీఎస్ శర్మ బదిలీపై ఇక్కడికి రానున్నారు. ఇప్పటివరకు ఎఫ్ఏసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న లీలాకుమార్ పూర్తిస్థాయి ఈవోగా కొనసాగేలా చూసేందుకు ఓ సామాజికవర్గానికి చెందిన నాయకులు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆలయవర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

వేదాద్రి ఆలయ ఈవో సురేష్‌బాబు

జగ్గయ్యపేట: వేదాద్రిలో యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఈవో హేమలతాదేవి బదిలీ అయ్యారు. ఆమెస్థానంలో విజయవాడ పాత శివాలయం ఈవోగా పనిచేస్తున్న కానూరు సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈవో హేమలతాదేవిని నున్నకు బదిలీ చేస్తూ దేవాదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

బాలుడికి కాలు తొలగింపు



జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల సంభవించిన వరదలకు పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన పన్నెండేళ్ల బాలుడు కొత్తా భవదీప్ కాళ్లు ఇన్‌ఫెక్షన్‌కు గురికావడంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఓ కాలు తీసేశారు. మరో కాలికి కూడా ఇన్‌ఫెక్షన్‌కు గురికావడంతో వైద్యులు చికిత్స చేస్తున్నారు. విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాలుడిని జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోమవారం పరామర్శించారు. బాలుడి వైద్యఖర్చులను ప్రభుత్వమే భర్తిస్తుందని హామీ ఇచ్చారు. అధికారులు కూడా బాలుడి కుటుంబసభ్యులను కలిసి మాట్లాడారు. అన్నివిధాల ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జనాలు

పెనుగంచిప్రోలు: చవితి పందిళ్లలో పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా సాగుతున్నాయి. పెనుగంచిప్రోలుతోపాటు ఆయాగ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను కమిటీ నిర్వాహకులు సోమవారం ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. తీన్‌మార్ డ్యాన్స్‌లు, బాణాసంచా మెరుపుల మధ్య నిమజ్జన కార్యక్రమాల సందడి హోరెత్తింది. ఊరేగింపు అనంతరం విగ్రహాలను స్థానిక మునేరు, కాలువల్లో నిమజ్జనం చేశారు.



పెనుగంచిప్రోలు బీసీకాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుని ఊరేగింపు

దెబ్బతిన్న రోడ్డు పరిశీలన



తొర్రగుంటపాలెంలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్‌చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల కురిసిన భారీవర్షాలకు తొర్రగుంటపాలెంలో అర్బన్ హెల్త్‌సెంటర్ వద్ద దెబ్బతిన్న రోడ్డును మున్సిపల్ చైర్మన్ ఆర్.రాఘవేంద్ర సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడిందన్నారు. వెంటనే మర్మమతులు చేపట్టాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆయన వెంట టీడీపీ యువ నాయకుడు శ్రీరాం చినబాబు, సీనియర్ నాయకుడు మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్లు సైదేశ్వరరావు, వెంకట్, సంగెపు బుజ్జి, మున్సిపల్ డీఈఈ శివకోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

అక్రమకేసుల బనాయింపు ఘనత ఎమ్మెల్యేదే



సబ్‌జైలు వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, న్యాయవాదులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: అక్రమ కేసులు బనాయించి అమాయకులను ఇబ్బందులు పెడుతున్న ఘనత నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకే దక్కిందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ఎద్దేవా చేశారు. స్థానిక సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న కీసర గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు పరిటాల రాము, మరో 10మందిని సోమవారం ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సబ్‌జైలు వద్ద ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతూ, దాడులు చేస్తూ తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమకేసులు బనాయిస్తున్నారన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా కంచికచర్ల మండలం కీసరలో టీడీపీ శ్రేణులు, వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపైకి వెళ్లి దాడులకు పాల్పడటమే కాకుండా తిరిగి 22మంది బాధితులపైనే హత్యాయత్నం కేసు నమోదుచేయించారన్నారు. బాధితులపై పోలీసుల ద్వారా వేధింపులకు పాల్పడుతున్నారంటూ మండిపడ్డారు. నందిగామ నియోజకవర్గంలో నమోదైనన్ని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు మరెక్కడా నమోదు కాలేదన్నారు. 22మందిపై హత్యాయత్నం కేసు పెట్టించిన ఘనత ఎమ్మెల్యే సౌమ్యకే దక్కిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కక్షసాధింపుల కోసం తోటి ఎస్సీలను వినియోగించుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇటువంటి చర్యలను మానుకోకపోతే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎమ్మెల్సీ వెంట న్యాయవాదులు బండి మల్లికార్జునరావు, పింగళి నరసింహారావు, కిరణ్, మౌలేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వేమా సురేష్‌బాబు, మలక్‌బషీర్, కాలవ పెద్దబాబు, యోహాన్, మార్త శ్రీను, శంకర్, కార్యకర్తలు ఉన్నారు.

టీటీడీ లడ్డూ పేరుతో రాజకీయం తగదు

వైఎస్సార్‌సీపీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ పేరుతో రాజకీయాలు చేయడం సీఎం చంద్రబాబుకు తగదని వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట పట్టణనాయకులు అన్నారు. జగ్గయ్యపేటలో వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి లాహోరి బద్దూనాయక్, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని హిందువులకు దూరం చేయాలనే కుట్రతోనే సీఎం చంద్రబాబు టీటీడీ లడ్డూ పేరుతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తన రాజకీయాల కోసం సీఎం చంద్రబాబు దేవుడిని కూడా వదలకపోవడం శోచనీయమన్నారు. వైఎస్సార్‌సీపీపై బురద చల్లడమే లక్ష్యంగా టీడీపీ కూటమి ఈ దుష్పచారానికి దిగిందన్నారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవుల్లో ఉండి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ హిందువుల మనోభావాలను గాయపరిచారన్నారు. ఎటువంటి తప్పు జరగకపోయినప్పటికీ సంప్రోక్షణ, ప్రక్షాళన అంటూ రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ఇది మతఘర్షణలను ప్రోత్సహించడమేనని గుర్తుచేశారు. ఇటువంటి దుశ్చర్యలను టీడీపీ కూటమి నాయకులు మానుకోవాలని వారు హితవు పలికారు. కార్యక్రమంలో గోర్‌భాయ్ సేవాసంఘం నియోజకవర్గ కార్యదర్శి బి.రాజునాయక్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బద్దూనాయక్, జగదీష్, మనోహర్ తదితరులు